క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏవో

కోనరావుపేట: మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ హెచ్చరించారు. ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. మండలంలోని కనగర్తి, మామిడిపల్లి, కొండాపూర్, నిమ్మపల్లి, సుద్దాల గ్రామాల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: ఇళ్లులేని నిరుపేదలందరికీ వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలని సీపీఎం డివిజన్ కన్వీనర్ ఎర్రవెల్లి నాగరాజు అన్నారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికి సీపీఎం ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించి, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా, ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతామన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, ప్రశాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందన



జ్ఞాపికలతో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులను తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(టీజీవో) ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఒకే పాఠశాలకు చెందిన ఆరుగురు ఎంపిక కావడం విశేషమని టీజీవో జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ అన్నారు. 2022–2023 విద్యా సంవత్సరం పదో తరగతిలో 10 జీపీఏలు సాధించిన విద్యార్థులు నేవూరి నిహారిక, మహ్మద్ రిహాన్, బత్తుల హారిణి, సిరిసిల్ల పల్లవి, గాజుల వైష్ణవి, కొడిమ్యాల చందనకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. హెచ్‌ఎం దబ్బెడ హన్మండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు మట్టి బంగారం

- ఉపాధి హామీ ద్వారా చెరువుల్లో పూడికతీత
- పోషకాలు అధికం
- అధిక దిగుబడి
- ఎరువుల ఖర్చులు తక్కువ
- నల్లమట్టికి భలే గిరాకీ

వీర్నపల్లి: ఉపాధి హామీ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులో నల్లమట్టిని తీసే పనులు గత నెలలో పెద్ద ఎత్తున చేపట్టారు. చెరువుల్లో మట్టిని కూలీల సాయంతో తవ్వించి, ట్రాక్టర్ల సహాయంతో పంట పొలాలకు తరలించారు. ఈ మట్టి కోసం రైతులు పోటీ పడ్డారు. ఫలితంగా భూసారం పెరిగి దిగుబడులు అధికం అవుతాయనే అభిప్రాయాన్ని అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్లతో చెరువు మట్టిని తీసుకెళ్తున్న రైతులు

వీర్నపల్లి మండలంలోని 17 గ్రామపంచాయితీల పరిధిలో 6,250 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతుంటాయి. పోడు భూముల కలిపితే మరో వెయ్యి ఎకరాల భూములున్నాయి. ఇక్కడి నేలలు కొంత సాగుకు ప్రతికూలంగా ఉండడంతో అన్నదాతలు రసాయనాలను అధికంగా వాడుతున్నారు. పంట మార్పిడి చేయకపోగా, అధికంగా వాడే రసాయనాలు నేల సారవంతం దెబ్బతింటున్నాయి. దీన్ని అధిగమించేందుకు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను ఎంచుకుంటున్నారు. సారవంతమైన చెరువు మట్టిని పొలాలకు వినియోగిస్తున్నారు. అలాగే జీవాల పేడను కమతాల్లో చల్లుతూ నేల సారాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఉపాధిహామీ పనులు ఆసరాగా నిలుస్తున్నాయి. కార్మికులకు వేతనాలు కల్పించడంతోపాటు బహుళ ప్రయోజనాలు ఇచ్చేలా చెరువుల్లో పూడికతీత, పంటలకు జీవం చేకూరుతుంది. అన్నదాతలు ట్రాక్టర్ల సాయంతో వంతులవారీగా పొలాలకు మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్లకు అద్దెలు చెల్లించి ఒండ్రుమట్టిని తీసుకువెళుతున్నారు. పోసిన నల్లమట్టిని దుక్కుల్లో కలియదున్నడంతో చేను సారవంతమవుతుందని అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రసాయనాల అతి వినియోగం తగ్గి భూములు మాగాణులుగా మారుతాయని చెబుతున్నారు.

పోషకాలు అధికం

రైతులు రసాయనిక ఎరువులను పరిమితికి మించి వాడకంతో నేల సారాన్ని కోల్పోవడమే కాకుండా తెగుళ్లు కూడా అధికం అవుతాయి. రైతులు నేల సారాన్ని పెంచే ప్రక్రియలో భాగంగా చెరువు మట్టిని రైతులు పొలాలకు వేయడం వలన ఎన్నో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అడవుల నుంచి వచ్చే వరద అనేక లవణాలు, పంటకు మేలు చేకూర్చే పోషకాల మిళితం. వరదలో కొట్టుకువచ్చిన ఒండ్రు చెరువులో చేరి భూమిపై పొరలా పర్చుకుంటుంది. ఒండ్రు మట్టి పొలాలకు బాగా ఉపయోగపడుతుంది. చెరువు మట్టి తోలడం వలన పొలాల్లో తేమ ఎక్కువగా నిలువ ఉంటుంది. చెరువు మట్టిలో 60–70 శాతం వరకు ఒండ్రు మట్టి, 30 నుంచి 40 శాతం వరకు బంక మట్టి ఉంటుంది. స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు కొద్దివరకు ఉంటాయి. చెరువు మట్టి వేయడం వలన నీటిని నిలువ ఉంచుకునే శక్తి 4–7 శాతం పెరగడమే కాకుండా రసాయనిక ఎరువుల వినియోగాన్ని 10 శాతం వరకు తగ్గించుకోవచ్చు. చెరువు 3 అడుగుల లోతు వరకు మాత్రమే మట్టిని తీసి పొలాలకు వాడుకోవాలి.



పొలంలో పోసిన నల్లమట్టి

భూసార పరీక్షలు ముఖ్యం

రైతులు చెరువు మట్టిని తీసుకెళ్లే ముందు ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా మంచిది. లవణ సాంద్రత నాలుగు శాతం తక్కువ మరియు ఉదజని సూచిక విలువ 6–8 మధ్య ఉన్నప్పుడు మాత్రమే చెరువు మట్టిని పంట పొలాలకి వేసుకోవాలి. పత్తి, వరి పండించే రైతులు చెరువు మట్టిని వేసుకుంటే కొంత వరకు మొదటి రెండు పంటలు తక్కువ తెగుళ్లతో మంచి దిగుబడులను పొందవచ్చు. రైతులు చెరువు మట్టిని వేసుకున్నాక మురుగు నీరు బయటికి పోయే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. లేకుంటే చేనులో అధిక నీరు నిలువ ఉండడం వల్ల పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. పంటలను బట్టి వాతావరణ పరిస్థితులను బట్టి నేలలో లభించే పోషకాల స్థాయిని బట్టి పంటకు అన్ని పోషకాలు సరైన పరిమాణంలో సరైన పద్ధతుల్లో సరైన మొక్క దశల్లో వేసినపుడు మాత్రమే పోషకాల సమతూల్యత అనేది ఏర్పడి మంచి దిగుబడులు సాధించవచ్చు అని వ్యవసాయాధికారులు అంటున్నారు.

అవగాహన కల్పించాలి



గతంలో చెరువు మట్టిని పంట పొలంలో వేసుకున్నాను. దీంతో పంటకు లాభం చేకూరింది. దిగుబడి పెరగడంతోపాటు రసాయనాలు, ఎరువులకు పెట్టుబడులు తగ్గాయి. ఇలాంటి చెరువు మట్టి వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

– మాడుగుల సాయి చందు, రైతు, వీర్నపల్లి

భూసారం పెరుగుతుంది



చెరువులోని నల్లమట్టితో భూమి సారవంతంగా మారుతుంది. చౌడు భూముల్లో కూడా పచ్చని పంటలు పండించవచ్చు. చెరువు నల్లమట్టిలో తేమ ఎక్కువగా ఉండటం వలన పంటకు నీటి నిల్వలు బాగా ఉంటాయి. సేంద్రియ ఎరువులా ఉపయోగపడుతుంది. ఒక సంవత్సరం చెరువు మట్టి వేయటం వలన మూడేళ్ల వరకు భూమి సారవంతంగా ఉంటుంది. పంటకు మేలు చేస్తుంది.

– శ్రీధర్‌రెడ్డి, ఏఈవో, వీర్నపల్లి

సమాచారం

నేడు స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

బోయినపల్లి: హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 2023–2024 విద్యా సంవత్సరానికి గాను నాలుగు, ఐదోతరగతులలో ప్రవేశాలకు ఈనెల 6న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి 8–9 ఏళ్లు, 5వ తరగతితో 9–10 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల్లోపు బోయినపల్లి హైస్కూల్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 94406 39560లో సంప్రదించాలని కోరారు.

నియామకం

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

కోనరావుపేట: మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మంగళి ప్రవీణ్‌మాదిగ ఎన్నికైనట్లు జిల్లా ఇన్‌చార్జి తంగళ్లపల్లి దేవరాజు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా అక్కెనపల్లి శ్యామ్, ఉపాధ్యక్షుడిగా తాండ్ర ప్రభాకర్, కోశాధికారిగా పసుల జలేందర్, కార్యదర్శిగా పసుల మనోజ్, సంయుక్త కార్యదర్శిగా మంగళి మహేశ్, సలహాదారులుగా పసుల పోశయ్య, మంగళి నర్సయ్య, నరేశ్, ప్రశాంత్ ఎన్నికైనట్లు తెలిపారు.

వృద్ధులను సేవా భావంతో ఆదరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ రేణుక

ఎల్లారెడ్డిపేట: వృద్ధులను అందరూ సామాజిక బాధ్యతగా సేవా భావంతో ఆదరించాలని ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని డేకేర్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. కేంద్రంలోని రికార్డులు, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న వృద్ధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, చివరి దశలో వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, హసన్, నిర్వాహకులు మమత, సుజాత, కొమురయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి నిధులు మంజూరు



పీహెచ్‌సీ కోసం స్థలం పరిశీలిస్తున్న నాయకులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ రూ.1.70 లక్షలు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ గుగులోత్ కళావతి తెలిపారు. అలాగే అటవీశాఖ ద్వారా రెండు ఎకరాల స్థలం కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. త్వరలోనే మంత్రి కేటీఆర్‌తో కలిసి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఏబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్ ఉపసర్పంచ్ బోయిని రవి, ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్, సర్వేయర్ శృతి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ



ఆషాఢమాసం సందర్భంగా జిల్లా కేంద్రం సిరిసిల్లలో బోనాల పండుగను పలువార్డుల్లో ఘనంగా జరుపుకున్నారు. గాంధీచౌక్‌లోని పాత కూరగాయల మార్కెట్ వ్యాపారులు, 34వ వార్డుల్లో బోనాల ప్రదర్శన జరిపారు. వందలాది సంఖ్యలో మహిళలు నెత్తిన బోనాలెత్తుకుని పోచమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, దార్ల కీర్తన, రెడ్యానాయక్, అన్నారం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి పూర్ణచందర్, దార్ల సందీప్ పాల్గొన్నారు. తంగళ్లపల్లి ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పద్మనగర్ నాగుల ఎల్లమ్మ గుడి వద్ద ఎల్లమ్మ పండగ సందర్భంగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. – సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి

మహిళలు, చిన్నారుల ఆరోగ్య రక్షణ లక్ష్యం



తంగళ్లపల్లిలో..



బోయినపల్లి: రత్నంపేటలో..

తంగళ్లపల్లి/సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్/వీర్నపల్లి/బోయినపల్లి/గంభీరావుపేట: ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య రక్షణ కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం తెలిపారు. తంగళ్లపల్లి మార్కండేయ ఫంక్షన్ హాలులో విలేజ్ హెల్త్, సానిటైజేషన్, న్యూట్రీషన్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, బాలామృతం, బాలామృతం ప్లస్ అందజేశారు. అలాగే సిరిసిల్ల బీవైనగర్ సెక్టార్ నెహ్రూనగర్, ప్రగతినగర్, సర్దాపూర్, వేములవాడ ఓల్డ్ అర్బన్ కాలనీ 10వ వార్డు, వీర్నపల్లి మండలం గర్జనపల్లి, వన్‌పల్లి, గంభీరావుపేట, కొత్తపల్లి, బోయినపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, కల్లూరి రాజు, లింగంపల్లి సత్యనారాయణ, సర్పంచులు అంకారపు అనిత, పాటి దినాకర్, గొర్రె కరుణ, లత, ఎంపీటీసీలు కోడి అంతయ్య, అరుణ్‌కుమార్, ఎంపీడీవో లచ్చాలు, మెడికల్ ఆఫీసర్ స్నేహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుస్మిత, అంజమ్మ, రేణుక, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి కార్యకర్తలు పద్మ, అరుణ పాల్గొన్నారు.



వేములవాడఅర్బన్: చిన్నారికి పౌష్టికాహారం అందజేస్తున్న కార్యకర్తలు



సిరిసిల్లటౌన్: కిట్లు అందిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

చిత్రకథ



హరిత.. మేత

సిరిసిల్లటౌన్: పార్కులు పశువుల మేతకు కేంద్రాలవుతున్నాయి. ప్రభుత్వం హరితహారం, పట్టణ ప్రగతి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తరుణంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పశువులు మున్సిపల్ పార్కులు, రోడ్ల వెంట మొక్కలను మేస్తున్నాయి. నిలువరించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలా పచ్చని మొక్కలు పశువులకు మేతగా మారుతున్నాయి. ఇందిరాపార్కులో బుధవారం ఉదయం 8 గంటలకు మేకల మందగా వచ్చి మొక్కలను మేస్తున్న దృశ్యం సాక్షి క్లిక్ మనిపించింది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమ్మె కరపత్రాలతో వంట కార్మికులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో వంట కార్మికుల సమ్మె కరపత్రాన్ని బుధవారం అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జూలై 7న వంట కార్మికుల పెండింగ్ బిల్లులు కొరకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వంట కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య, వంట కార్మికులు పాల్గొన్నారు.

బెస్ట్ అవేలబుల్ స్కూల్‌గా విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ బెస్ట్ అలేలబుల్ స్కూల్‌గా ఎంపికైందని స్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ లతీఫ్ తెలిపారు. లతీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ఏడు పాఠశాలలకు 2023–24 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవేలబుల్ స్కూల్‌గా ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఒకటో తరగతిలో షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. రూ.1.50 లక్షల ఆదాయం ఉన్న వారు ఈనెల 15లోపు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చర్యలు తీసుకోండి

వేములవాడరూరల్: ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ విద్యార్థి సంఘం కార్యదర్శి పాతూరి అర్జున్ ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పాఠశాలకు విరాళం



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రాజుకుమార్ తాను చదువుకున్న పాఠశాల ప్రహరీ గేట్ నిర్మాణానికి విరాళం అందించాడు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



దేవేందర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికైన మండలం సుద్దాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దేవేందర్‌రావును ఎస్‌ఎంసీ ఆధ్వర్యంలో సర్పంచ్ దేవలక్ష్మి, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, ఎస్‌ఎంసీ ఎరవెల్లి విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కోనరావుపేట: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు పోచయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.12 వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు రాజు, అగ్రహారం ఆలయ ధర్మకర్త సిద్దంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బొడ్డు చంద్రయ్య, ప్రశాంత్ అందజేశారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి బుధవారం పంపిణీ చేశారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

చందుర్తి: అనారోగ్యంతో మృతిచెందిన మండలం బండపల్లి గ్రామానికి చెందిన మంజీర రమేశ్ ఎ భార్య రేణుకకు డాక్టర్ గోలి మోహన్ రూ.5 వేలు, బండపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొండ బాలకృష్ణగౌడ్ రూ.3 వేలు బుధవారం అందజేశారు.

పరామర్శ

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి గ్రామ సర్పంచ్ పెంద్యాల తిరుపతి భార్య ఇటీవల మృతి చెందగా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఆధ్యా గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ బుధవారం పరామర్శించారు.

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో మృతి చెందిన మోకెనపల్లి లస్మయ్య, నాగారంలో మృతిచెందిన వీఆర్‌ఏ నరేందర్, కనగర్తిలో మృతి చెందిన పోతుగంటి ఎల్లవ్వ కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన సిరిసిల్ల బీఆర్‌ఎస్వీ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ తండ్రి రిటైర్డ్ సెస్ ఏఈ సుంకపాక రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు.

బోరుబావులకు భూమిపూజ

వీర్నపల్లి: మండలంలో ఎర్రగడ్డ తండా, వన్‌పల్లి గ్రామాల్లో బోరుబావులకు సర్పంచులు జగుమాల్, జోగినిపల్లి లత బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో రూ.2.54 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం సెస్ డైరెక్టర్ రవిందర్‌రెడ్డి ప్రారంభించారు. లోటల్టేజి సమస్యలను పరిష్కరించేందుకు అవసరం ఉన్న చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి, గాలిపల్లి, ముస్కాన్‌పేట గ్రామాల్లో బుధవారం సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక



కోనరావుపేట: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి కనగర్తిలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలకు 23 మంది బాలురు, 24 బాలికలు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను మూడు రోజుల్లో ప్రకటిస్తామని ఎంఈవో దూస రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు ఎస్‌కే మొయినొద్దీన్, అజయ్, దివ్య, అనిత, వెంకటేశ్, హెచ్‌ఎం మాణిక్యం పాల్గొన్నారు.